

ఘనంగా పోలమాంబ మారుజాతర

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ అమ్మవారి మారుజాతర మంగళవారం ఘనంగా జరిగింది. - 8లో

ప్రణతోస్మి దివాకరం - 8లో



మాఘ శుద్ధ సప్తమి పర్వదినం సూర్యజయంతి (రథసప్తమి) సందర్భంగా సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం రాత్రి 9 గంటల వరకు అరసవల్లిలో సూర్యనారాయణ మూర్తిని వేలాది మంది దర్శించుకున్నారు.

అవయవదానానికి అంగీకారం



విజయనగరం అర్బన్: విజయనగరం తహసీల్దార్ సీల కూర్మనాథరావు, ఆయన సతీమణి, డీటీ ఎం.ఉమ అవయవదానానికి ముందుకొచ్చారు. అనుమతి పత్రాన్ని చీపురుపల్లి మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గోవిందరాజుకు మంగళవారం అందజేశారు. దంపతుల సామాజిక స్ఫూర్తిని ఉద్యోగులు కొనియాడారు.

న్యూస్‌రీల్

సురక్షిత ప్రసవాలే లక్ష్యం కావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: గర్భిణుల ఆరోగ్యం, సురక్షి ప్రసవాలే లక్ష్యంగా స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో స్త్రీ శిశుసంక్షేమ కార్యక్రమాలపై మంగళవారం సమీక్షించారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు అంగన్‌వాడీలు కీలక భూమిక పోషించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు టేక్‌హోం రేషన్ ఇవ్వడమే కాకుండా అంగన్‌వాడీ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, డీసీపీఓ ఎ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గౌరీపురం వద్ద ఏనుగుల గుంపు



పెదకుదమ-గౌరీపురం పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ–గౌరీపురం పంట పొలాల మధ్య ఏనుగులు మంగళవారం దర్శనమిచ్చాయి. అరటి, పామాయిల్ తోటల్లో సంచరిస్తూ నాగావళి నదిలోకి జారుకుంటున్నాయి. పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. వరి నాట్లు వేసేందుకు బిక్కుబిక్కుమంటున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

10 నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ




పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

వీరఘట్టం: పదోతరగతి విద్యార్థులకు ఈ నెల 10 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తామని డీఈఓ ఎన్.తిరుపతినాయుడు తెలిపారు.
10 న ఫస్ట్ లాంగ్వేజ్, 11న సెకెండ్ లాంగ్వేజ్, 12న ఇంగ్లిష్, 15న గణితం, 17న ఫిజికల్ సైన్స్, 18న బయలాజికల్ సైన్స్, 20న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు.

ప్రయోగ పరీక్షలకు వేళాయె..

పార్వతీపురంటౌన్: పరీక్షల సీజన్ మొదలైంది. ఇంటర్మీడియట్, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల కావడంతో విద్యార్థులను సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం నుంచి ప్రయోగపరీక్షలు జరగనున్నవి. 5-10, 11-15, 16-20 తేదీల్లో మూడు ఫేజ్‌లలో ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బోటనీ సబ్జెక్టు 1808 మంది, జువాలజీ1808, ఫిజిక్స్ 4,217, కెమిస్ట్రీ సబ్జెక్టుకు 4,217 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జిల్లాలో 6,026 మంది జనరల్ విద్యార్థులు, 5926 ఒకేషనల్ విద్యార్థులు ప్రయోగ పరీక్షలు రాయనున్నారు. జనరల్ ప్రాక్టికల్స్‌కు 37, ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 40 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేవామని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రయోగ పరీక్షలు సాగుతాయని డీవీఈఓ మంజులా వేణ తెలిపారు. తమ విద్యార్థులు అధిక మార్కులు సాధించేలా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఏర్పాట్లు చేసినట్టు సమాచారం.

కొనసాగుతున్న నిరవధిక నిరాహార దీక్షలు



భవనాలపైకి ఎక్కి నినదిస్తున్న విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి వెటర్నరీ కళాశాల విద్యార్థులు రెండో రోజు మంగళవారం నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగించారు. వీసీఐ గుర్తింపుతో పాటుగా ఇంటర్న్‌షిప్ స్టైఫండ్‌ను రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కళాశాల ఆవరణలో ర్యాలీ చేశారు. కళాశాల భవనాలపైకి ఎక్కి తమ డిమాండ్లు పరిష్కరించే వరకు దీక్షలను ఆపేది లేదని హెచ్చరించారు.

హే బిడ్డా.. ఇది మా ఏరియా!





సాలూరు ఏరియా ఆస్పత్రి

- సాలూరు ఏరియా ఆస్పత్రికి 'రాజకీయ' రోగం
- సూపరింటెండెంట్ కుర్చీ కోసం తన్నులాట
- న్యాయ స్థానం ఉత్తర్వులనూ ధిక్కరిస్తున్న వైనం
- 'ఆమె' ఒప్పుకుంటేనే సీటులో కొనసాగేది
- ప్రసన్నంచేసుకునే పనిలో వైద్యులు, సిబ్బంది

సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు: సాలూరు పట్టణ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ స్థానం ఇప్పుడు 'హాట్' సీటు!. చివరికి ఆస్పత్రిని కూడా వదలని కూటమి నాయకుల 'రాజకీయ' కుతంత్రానికి ఇదో నిదర్శనం. న్యాయస్థానం ఉత్తర్వులను సైతం ధిక్కరిస్తూ అధికార దర్పంతో ముందుకువెళ్తున్న వైనం. అసలు ఆ పోస్టుకు ఎందుకంత డిమాండ్.. ఒకరిని మించి మరొకరికి అంత పంతం ఏమిటి? ఇప్పుడు సాలూరు పట్టణంలో జోరుగా నడుస్తున్న చర్చ ఇదే. పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సీనియర్ వైద్యురాలు వీఆర్ మీనాక్షిని గతంలోనే నియమిస్తూ శాఖాపరమైన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ తర్వాత పలు రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఉత్తర్వులు కాస్త నిలిచిపోయాయి. కొద్దిరోజులు పోయాకైనా పరిస్థితులు మారుతాయని.. అర్హత, సీనియారిటీని బట్టి తాను మరలా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తానని ఆమె భావించారు. కొన్నాళ్లు వేచి చూశారు. చివరికి న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ఇటీవల కోర్టు తీర్పుతో ఆమె సాలూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు.

ఇక్కడే ట్విస్ట్..

కోర్టు ఆర్డర్‌తో ఆమె విధుల్లోకి రావడంతో కథ సుఖాంతమైందని అంతా భావించారు. ఇక్కడే మళ్లీ కథ మొదటికొచ్చింది. ఆమెకు చార్జ్ ఇవ్వలేదు. బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మీనాక్షి.. జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లారు. అక్కడ ఏం జరిగిందో గానీ.. తన స్థానం పదిలమయ్యే పరిస్థితులు లేవని ఆమె గ్రహించారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ.. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధి అంగీకారం లేకపోతే ఆ సీటులో కొనసాగే పరిస్థితి లేదన్నట్లు వైద్య వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇన్నాళ్లూ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ రత్నకుమారినే కొనసాగించాలని సదరు ప్రజాప్రతినిధి భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఏరియా ఆస్పత్రిలో 13 మంది వరకు వైద్యులు, ఇతర సిబ్బంది ఇటీవల రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కలిసినట్లు.. డాక్టర్ మీనాక్షినే సూపరింటెండెంట్‌గా ఉంచాలని కోరినట్లు వైద్య వర్గాల్లో ప్రచారం సాగుతోంది. జరుగుతున్న పరిణామాలను ఆమె దృష్టిలో పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న రత్నకుమారికి వ్యతిరేకంగా తమ వాదనను వీరంతా గట్టిగా వినిపించినట్లు తెలుస్తోంది. దీనిపై మంత్రి ఇంకా ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదని తెలుస్తోంది.

రాజకీయం పులుముకుంటున్న అంతర్గత విభేదాలు

నానాటికీ సాలూరు ఏరియా ఆస్పత్రిలో అంతర్గత విభేదాలు రాజకీయం పులుముకుంటున్నాయి. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సింది పోయి.. ఒక కుర్చీ కోసం ఎందుకంత ప్రతిష్టకు పోతున్నారన్న చర్చ పట్టణ ప్రజల్లో వినిపిస్తోంది. డాక్టర్ మీనాక్షికి సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించడం ఆస్పత్రిలో ఓ వర్గానికి ఇష్టం లేదని తెలుస్తోంది. కోర్టు ఉత్తర్వులతో ఆమె విధుల్లో చేరినప్పటికీ చార్జ్ ఇవ్వకపోవడం ఇందుకు ఊతమిస్తోంది. దీని వెనుక ఎవరున్నారు? ఎందుకంత పంతం పట్టారు? అన్న చర్చ సాగుతోంది. గత ప్రభుత్వం కృషితో సాలూరు ఏరియా ఆస్పత్రి వంద పడకలుగా రూపుదిద్దుకుంటోంది. నూతన భవన నిర్మాణం గత ప్రభుత్వ హయాంలోనే 80 శాతం పూర్తయ్యింది. మిగులు పనులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో ఆస్పత్రి నిర్మాణానికి, ఆధునికత కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నారు. ఇందులో కొంత మొత్తం పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏరియా ఆస్పత్రిలో రూ.5 లక్షలు వెచ్చించి అవసరం లేకున్నా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ వేయించేశారు. రూ.11 లక్షలతో ఆస్పత్రి వద్ద రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. అంత విలువ చేయదనేది ఒక వాదన. భవిష్యత్తులోనూ ఆస్పత్రికి పెద్ద ఎత్తున ఫండింగ్ రానుంది. ఇదే సమయంలో గత ప్రభుత్వ హయాం చివరి నాటికి ఇక్కడ 24 మంది వరకు వైద్యులుండేవారు. ప్రస్తుతం 17 మందే మిగిలారు. ఇక్కడ చేసేందుకు కూడా కొంతమంది వైద్యులు అయిష్టత చూపుతున్నారు. దీనికి ఆస్పత్రిలో అంతర్గత విభేదాలు, వేధింపులే కారణమని తెలుస్తోంది. ప్రాణాలు పోయాల్సిన వైద్యులే.. ఇలా 'రాజకీయాలు' పట్టుకుని వేలాడటం... ఇందులోనూ ప్రజాప్రతినిధులు తలదూర్చడం చూస్తుంటే.. ఆస్పత్రిలో సేవలు ఎలా మెరుగుపడతాయన్నది పట్టణ ప్రజల వాదన.

నేడు జీడి తోటల ఫలసాయానికి వేలం

- జీవో విడుదల చేసిన జిల్లా అటవీశాఖ అధికారి



వండువ కొండపై పూత దశలో ఉన్న జీడితోటలు

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామ పరిధిలోని 150 ఎకరాల జీడి తోటల ఫలసాయం పొందేందుకు ఈ నెల 5న ఉదయం 11 గంటలకు పార్వతీపురం అటవీశాఖ కార్యాలయంలో వేలంపాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా అటవీశాఖ అధికారి జి.ఎ.పి.ప్రసూన ఉత్తర్వులు జారీచేశారు. గత రెండేళ్లుగా అటవీశాఖ అధికారులే తోటల సస్యరక్షణ, పంటల విక్రయం చేపట్టారు.

తోటల విస్తరణ ఇలా...

వండువ కొండల్లో 1980లో 62.5 ఎకరాల్లో జీడి తోటలు వేశారు. మరలా 1982లో 87.5 ఎకరాల్లో జీడితోటలు సాగుచేశారు. మొత్తం 150 ఎకరాల్లో సుమారు 3,750 జీడి మొక్కలను వేశారు. మొక్కలు వేసిన ఐదేళ్ల తర్వాత ఫలసాయం బాగా వచ్చింది. అటు అటవీశాఖకు 40 శాతంమేర, గ్రామ పంచాయతీకి 60 శాతం మేర ఆదాయం సమకూరేది. కాలక్రమేణా ప్రకృతి వైపరీత్యాలు, తుఫాన్లు, ఈదురుగాలుల దాటికి వీటిలో రెండు వంతుల చెట్లు నేలమట్టమయ్యాయి. ప్రస్తుతం 1302 జీడి చెట్లు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ చెట్ల ఫలసాయానికి మాత్రమే వేలం పాట నిర్వహించనున్నారు. చెట్ల సంఖ్య తగ్గడంతో ఆదాయం తగ్గుతోందని, జీడిమామిడి మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

వేలం పాట నిబంధనలివే....

- వేలం పాటలో తోటలు లీజుకు వెళ్లకపోతే మరలా ఫిబ్రవరి 15న వేలం పాట నిర్వహిస్తారు. అప్పటికీ వేలం జరగకపోతే ఫిబ్రవరి 30న మరోసారి వేలం పాట నిర్వహిస్తారు.
- వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా వారు పాడబోయే తోటలను చూసుకోవాలి.
- ప్రతీ పాటదారు ధరావత్తు సొమ్ము రూ.5000 తో పాటు రూ.25వేలు నగదు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలి.
- పాట ముగిసిన వెంటనే నగదు సాల్వెన్సీ కాకుండా ధరావత్తు సొమ్ముతో కలపి 1/3 వంతు అదేరోజు చెల్లించాలి.
- పాట ఖరారైన వ్యక్తికి పాన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలి.

వేలం పాట పక్కాగా నిర్వహిస్తాం



జీడి తోటల ఫలసాయానికి నిర్వహించిన వేలంలో గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా పక్కాగా నిర్వహిస్తాం. వేలంను సిండికేట్ చేస్తే ఆ వేలంను రద్దు చేస్తాం. ప్రభుత్వ ఆదాయానికి గండిపడేలా ఎవరైనా లోపాయికారిగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– జీపీపీ ప్రసూన, డీఎఫ్ఓ, పార్వతీపురం మన్యం జిల్లా

రాములోరి పెళ్లికి పందిరిరాట

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో ఈ నెల 8న జరగనున్న స్వామివారి తిరుక్కల్యాణ మహోత్సవానికి అర్చకులు అంకురార్పణ చేశారు. ఆలయ తూర్పు రాజగోపురం వద్ద మంగళవారం ఉదయం పందిరిరాట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి వేకువజామున సుప్రభాతసేవ, బాలభోగం అయిన తరువాత రామస్వామివారి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం కార్యక్రమాలను నిర్వహించారు. పందిరరాట అనంతరం వెండి మండపం వద్ద శ్రీరాముడిని పెళ్లి కుమారుడిగా అలంకరించి విశేష పూజలు చేశారు.

ఆలయం వద్దకు చేరిన రథం

స్వామివారి రథయాత్ర మహోత్సవం ఈ నెల 11న రాత్రి 10 గంటలకు జరగనుంది. ఏటా ఆనవాయితీగా సీతారామునిపేట గ్రామానికి చెందిన భక్తులు రథాన్ని ఆలయం వద్దకు తీసుకువస్తుంటారు. ఈ నేపథ్యంలో సీతారామునిపేట గ్రామం నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీరామనామాన్ని జపిస్తూ స్వామివారి రథాన్ని ఊరేగింపుగా దేవాలయం వద్దకు మంగళవారం తీసుకువచ్చారు. ఇక్కడే రథయాత్రకు రథాన్ని ముస్తాబు చేస్తారు.



స్వామివారి వెండి మంటపం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఆంగ్లమాధ్యమానికే ఓటు



పదోతరగతి పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

- టెన్త్ తెలుగు మీడియం పరీక్షలపై మక్కువచూపని విద్యార్థులు
- విజయనగరం జిల్లాలో 9 శాతం, మన్యం జిల్లాలో 22 శాతం మంది మాత్రమే తెలుగు మాధ్యమానికి ఆప్షన్
- కూటమి కుట్రను తిప్పి కొట్టిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

విజయనగరం అర్బన్:

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆంగ్ల మాధ్యమం చదువులకే ఆసక్తి చూపుతున్నారు. పదోతరగతి పరీక్షలను ఆంగ్లమాధ్యమంలో రాసేందుకు అధికమంది టిక్ పెట్టారు. కూటమి ప్రభుత్వ ఆంగ్లమాధ్యమ నిర్వీర్య యత్నాలను తిప్పికొట్టారు. పేదకుటుంబాల పిల్లలు అంతర్జాతీయ అవకాశాలు అందుకునేలా గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రాథమిక విద్య నుంచే సర్కారు బడుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని అమల్లోకి తెచ్చింది. కార్పొరేట్ స్కూల్స్‌ను తలదన్నేలా సర్కారు బడికి ఆధునిక హంగులు అద్ది సీబీఎస్‌ఈ సిలబస్ బోధనకు శ్రీకారం చుట్టింది. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందజేసింది. ఊరి బడికి ఓ కొత్త వెలుగును తెచ్చింది. అయితే... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం అలముకుంది. ఆంగ్లమాధ్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు పూనుకుంది. ఈ దశలో సీబీఎస్‌ఈ సిలబస్ బోధనకు మంగళం పాడేసింది. పదోతరగతి పరీక్షలను తెలుగులోనూ రాసుకోవచ్చని ప్రత్యేక ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో చాలా చోట్ల విద్యార్థులపై ఒత్తిడి చేసింది. అయితే తెలుగులో పరీక్షలు రాసేందుకు విజయనగరం జిల్లాలో కేవలం 9 శాతం మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 22 శాతం మంది విద్యార్థులు మాత్రమే ముందుకు వచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలను తెలుగు మీడియంలోకి మార్చేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు పదో తరగతి విద్యార్థులు తగిన గుణపాఠం చెప్పినట్లయింది.

91 శాతం మంది ఆంగ్ల మాధ్యమంవైపే..

పదో తరగతి విద్యార్థులు ఇంగ్లిష్ మీడియానికే జై కొట్టారు. జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను 91 శాతం మంది ఇంగ్లిష్ మీడియంలోనే రాస్తామని ఆప్షన్ ఇచ్చారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరం పదో తరగతిలో మొత్తం 33,292 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా మార్చి 17 నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ క్రమంలో పాఠశాల విద్యాశాఖ నామినల్ రోల్స్ పంపాల్సిందిగా పాఠశాలలను ఆదేశించింది. ఈ ప్రక్రియ మొదలైన అనంతరం తెలుగులోనూ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించామని, తెలుగు మీడియంలో పరీక్షలు రాసేందుకు కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరింది. అయితే, ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా.. ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలల నుంచి కేవలం 4,508 మంది మాత్రమే తెలుగు మీడియంకు దరఖాస్తు చేసుకున్నారు. విజయనగరం జిల్లాలోని 22,928 మందిలో 9.4 శాతంతో 2,163 మంది, పార్వతీపురం మన్యంలో 10,364 మందిలో 22.6 శాతంతో 2,343 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య కేవలం 3,500 మించి ఉండదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన విద్యా సంస్కరణలతో 2023-24 విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఇంగ్లిష్ మీడియం పూర్తి స్థాయిలో లేకున్నా మెజార్టీ విద్యార్థులు స్వచ్ఛందంగా ఇంగ్లిష్ మీడియంను కోరుకొని పరీక్షలు రాశారు. గత ప్రభుత్వ ఆదేశాల అమలు ప్రకారం ఈ విద్యా సంవత్సరంలో పదోతరగతి ఇంగ్లిష్ మీడియంలోకి మారింది. అయినప్పటికీ కూటమి సర్కారు ఇంగ్లిష్ మీడియం రద్దుకు కంకణం కట్టుకుని పదోతరగతి విద్యార్థులను తెలుగు మీడియం వైపు తిప్పేందుకు శతవిధాలా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు.

పనిచేయని 'కూటమి' పాచికలు

- పాలకొండలో పట్టువీడని వైఎస్సార్‌సీపీ నాయకులు
- నగరపంచాయతీ చైర్మన్ ఎన్నికలో ఎత్తుకుపైఎత్తు
- కోరం లేక నిలిచిన చైర్మన్ ఎన్నిక
- తెల్లారిసరికే మంత్రితో సహా పాలకొండలో మకాం వేసిన కూటమి నేతలు
- చైర్మన్ ఎన్నిక నిలిచిపోవడంతో వెనుదిరిగిన వైనం



ఉదయం 11 గంటల సమయంలో కౌన్సిలర్ల కోసం ఎదురు చైస్తున్న ఎన్నికల అధికారి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పాలకొండ:

కూటమిది అధికార బలం... వైఎస్సార్‌సీపీది కౌన్సిలర్ల బలం... ఈ రెండింటి మధ్య పాలకొండ నగరపంచాయతీ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠకు తెర తీసింది. సంఖ్యాబలం లేకపోయినా నగర పంచాయతీ చైర్మన్ కుర్చీని తన్నుకుపోవాలన్న కూటమి నాయకుల యత్నాలకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఐక్యత, ఆలోచనతో చెక్‌పెట్టారు. ప్రలోభాలకు లొంగకుండా ఐక్యతా రాగం వినిపించారు. కోరం చాలక మంగళవారం నిర్వహించిన చైర్మన్ ఎన్నిక నిలిచిపోవడంతో తెల్లారిసరికే పాలకొండ వేదికగా పావులు కదిపిన అధికార పార్టీ నేతలు కంగుతిన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రలోభాలు పనిచేయవని, ఓటే వజ్రాయుధమన్న విషయం తెలిసొచ్చింది.

పాలకొండలో ఉత్కంఠ

నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక సోమవారం పలు నాటకీయ పరిణామాల మధ్య మంగళవారానికి వాయిదా పడిన విషయం తెలిసిందే. ఎన్నికపై అంతటా ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఉదయం 10 గంటల నుంచి చైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య కౌన్సిలర్లు హాజరైతే వారి హాజరును పరిగణనలోకి తీసుకుని ఎన్నిక నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 11.40 గంటలకు స్థానిక ఎమ్మెల్యే జయకృష్ణతో పాటు టీడీపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలో చేరిన మరో కౌన్సిలర్‌తో కలిపి నలుగురు సభ్యులు మాత్రమే ఎన్నిక కోసం హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల కోసం అందరూ ఎదురు చూశారు. ఎవరూ హాజరు కాకపోవడంతో కోరం లేక చైర్మన్ ఎన్నిక నిలిపివేస్తున్నట్లు ఎన్నికల అధికారి యశ్వంత్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఇక్కడ పరిస్థితిని కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారులకు తెలియజేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కూటమి నేతలకు భంగపాటు

అధికారం ఉంది కదా.. చైర్మన్ పదవి ఎలాగైనా లాక్కుందామనుకున్న కూటమి నాయకులకు చివరకు భంగపాటు తప్పలేదు. చైర్మన్ ఎన్నికకు సోమవారం నామినేషన్లు స్వీకరిస్తున్నప్పుడు 2వ వార్డు కౌన్సిలర్ ఇండిపెండెంట్‌గా వేసిన నామినేషన్‌ను ఎన్నికల అధికారి తిరస్కరించడం, వైఎస్సార్‌సీపీ నాయకులు విప్ జారీ చేయడం తదితర పరిణామాలతో చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. మంగళవారం ఆ పదవిని దక్కించుకుందామని తెల్లవారేసరికి మంత్రి సంధ్యారాణితో సహా స్థానిక ఎమ్మెల్యే జయకృష్ణ, కూటమి నాయకులు పాలకొండను చుట్టుముట్టారు. ఈ సారి కూటమి నాయకులు చైర్మన్ పదవి దక్కించుకుంటారనే ప్రచారం జోరుగా సాగింది. అయితే, ఈ ఎన్నికకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు హాజరకాకపోవడంతో చైర్మన్ ఎన్నిక నిలిచిపోవడంతో కూటమి నాయకులు కంగుతిన్నారు. తీవ్ర అసంతృప్తితో నగరపంచాయతీ కార్యాలయం నుంచి వెనుదిరిగారు.



ఉదయం 11.40 సమయంలో హాజరైన 4గురు కౌన్సిలర్లు, స్థానిక ఎమ్మెల్యే జయకృష్ణ

గట్టి బందోబస్తు

పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ కుర్చీ కోసం కూటమి నాయకులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతుండడంతో ఏం పరిణామాలు చోటుచేసుకుంటాయోనని పోలీసు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో సీఐ ఎం.చంద్రమౌళి, ఐదుగురు ఎస్ఐలు బందోబస్తును పర్యవేక్షించారు. జిల్లా ఇంటిలిజెన్స్ పోలీసులు కూడా ఇక్కడికి చేరుకుని ఏం జరుగుతుందోనని ఆరా తీశారు.
నాటకీయ పరిణామాల మధ్య చైర్మన్ ఎన్నిక నిలిచిపోవడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును కొనసాగించారు.



నగర పంచాయతీ కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు

క్లుప్తంగా

చెరకు ట్రాక్టర్ బోల్తా



వాహనాలను దారి మళ్లిస్తున్న ఏఎస్సై ప్రసాద్

వంగర: మండల పరిధిలోని మగ్గూరు గ్రామం సమీపంలో మంగళవారం చెరకు ట్రాక్టర్ బోల్తా పడింది. భారీ లోడుతో సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో రాజాం, వంగర వైపు వెళ్లే వాహనదారులు అవస్థలు పడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు.

కారు ఢీకొని ఆవు మృతి

• నుజ్జునుజ్జయిన కారు



మృతి చెందిన ఆవు

బొండపల్లి: వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో జాతీయ రహదారి26ను దాటుతున్న ఆవు అక్కడిక్కడే మృతి చెందగా ఇదే ప్రమాదానికి కారణమైన కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. మంగళవారం వేకువజామున జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి గ్రామానికి సమీపంలో గల జాతీయ రహదారిపై ఆవు దాటుతుండగా వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన సంగతి తెలిసిన వెంటనే ఎస్సై మహేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

కుటుంబం చెంతకు వృద్ధుడు

సీతమ్మధార: విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన పూసరెడ్డి అప్పలస్వామి (68) గత నెల 26న నగరంలోని ఆశీల్‌మెట్ట జంక్షన్‌లో భిక్షాటన చేస్తుండగా ఏయూటీడీ ప్రతినిధులు గమనించి షెల్టర్ హోమ్‌కు తరలించారు. ఆ వ్యక్తి చిరునామా తెలుసుకుని మంగళవారం భోగాపురం దగ్గరలో గల పెదుసుబ్బవానిపాలెంలోని కొడుకు అప్పారావుకు అప్పగించారు. ఇల్లు, పొలం ఉండడంతో పాటు పెన్షన్ కూడా వస్తున్న అప్పలస్వామి మద్యపానానికి అలవాటు పడి విశాఖలో భిక్షాటన చేస్తుంటాడని, అతని భార్య మరణించిందని ఏయూటీడీ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో కార్మికుడి మృతి



రమణ (ఫైల్)

మల్కాపురం (విశాఖ): డాక్‌యార్డు సమీపంలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడు అకస్మాత్తుగా మృతిచెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా మంగళపాలెం వద్ద గల దేశపాత్రునిపాలెం ప్రాంతానికి చెందిన గొరపల్లి రమణ (35) హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో 15 ఏళ్ల నుంచి పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లి సంస్థలో గ్యాస్ సిలిండర్లను అన్‌లోడ్ చేస్తున్న సమయంలో రాత్రి పదిగంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు వెంటనే షీలానగర్ వద్ద ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించేందుకు ప్రయత్నించగా..కుటుంబసభ్యులు, కార్మికులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. సోమవారం రాత్రి 12 గంటల నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి ఆందోళన కొనసాగించారు. యాజమాన్యంతో కార్మిక సంఘాలు చర్చలు జరపగా యాజమాన్యం దిగొచ్చి మృతుని కుటుంబానికి రూ.14 లక్షల పరిహారం చెల్లిస్తామని అంగీకరించింది. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. మృతుడికి భార్య రమణమ్మ, దుర్గ, కల్యాణి అనే ఇద్దరు కుమార్తెలున్నారు.

ఘనంగా పోలమాంబ మారుజాతర

- ఉదయం 10.30గంటల తరువాత పెరిగిన భక్తుల రద్దీ
- భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టిన సీఐ రామకృష్ణ, ఎంపీడీవో స్వరూపరాణి, ఎస్సై వెంకటరమణ
- బస్సులు చాలక ఇబ్బందులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అమ్మవారికి ఘటం చెల్లిస్తున్న భక్తుడు



శంబర పోలమాంబ అమ్మవారు



గోముఖి నది ఒడ్డున మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



క్యూలో భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబరపోలమాంబ అమ్మవారి మారుజాతర మంగళవారం ఘనంగా జరిగింది. గతేడాది కంటే ఈఏడాది మారుజాతరకు భక్తుల రద్దీ తగ్గింది. రథసప్తమి పండగ సందర్భంగా భక్తులు తగ్గి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఉదయం తొలుత భక్తుల రద్దీ తక్కువగా ఉన్నప్పటికీ, 10.30గంటల తరువాత ఒక్కసారిగా భక్తులు శంబర గ్రామానికి చేరుకోవడంతో దారులన్నీ రద్దీగా మారాయి. భక్తుల రద్దీ పెరగడంతో ఈవో వీవీ సూర్యనారాయణ, సీఐ రామకృష్ణ, ఎంపీడీవో స్వరూపరాణి, ఎస్సై వెంకటరమణ, ఉత్సవ కమిటీసభ్యులు దగ్గరుండి అమ్మదర్శనానికి భక్తులను తరలించారు.

అమ్మను దర్శించుకున్న భక్తులు

చదురుగుడి, వనంగుడిలో కొలువైన శంబరపోలమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. గోముఖినది ఒడ్డున తలనీలాలు సమర్పించి నదిలో స్నానాలు ఆచరించారు. కోళ్లు, మేకలు, చీరలు మొక్కుబడులుగా చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించారు. వనంగుడి వెనుకన ఉన్న వేపచెట్టుకు భక్తులు పూజలు చేశారు. అలాగే ప్రధానవీధిలోని సిరిమాను కర్రకు భక్తులు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. చదురుగుడి వద్ద క్యూలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది.

బస్సులు చాలక అవస్థలు

పార్వతీపురం, బొబ్బిలి నుంచి శంబరకు వచ్చే ఆర్టీసీ బస్సులు చాలకపోవడంతో భక్తులు అవస్థలు పడ్డారు. ఒక్కో బస్సుకోసం 40నిమిషాల వరకు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని భక్తులు ఆవేదన వెలిబుచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అదే పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు ఆటోలు, ఇతరత్రా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి, వారి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

108 వాహనంలో గిరిజన మహిళ ప్రసవం

- ప్రసవం తర్వాత హుటాహుటిన ఘోషా ఆస్పత్రికి తరలింపు



ప్రసవించిన గిరిజన మహిళ, శిశువుతో 108 సిబ్బంది

బొండపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డోలీ మోతలు నివారించి గిరిజనులకు ఎటువంటి వైద్య సేవలకు ఆటంకం లేకుండా పక్కాగా సేవలు అందిస్తామని ఇచ్చిన హామీలు నీటిమూటలు గానే మిగిలాయి. గిరిజనులకు కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడు నెలలు గడిచినా వారి వైద్య సేవల పట్ల ఎటువంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. దీనికి ఉదాహరణగా మంగళవారం సాయంత్రం జరిగిన సంఘటన నిలుస్తోంది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మెంటాడ మండలంలోని మిర్తివలస గిరిజన గ్రామానికి చెందిన పాడి గౌరమ్మకు రెండవ కాన్పు కాగా పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి ప్రసవం కోసం తీసుకువచ్చారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు ప్రథమ కాన్పు సిజేరియన్ చేయడం వల్ల రెండవ కాన్పు ఇక్కడ చేయడం కుదరదని వాహనంలోనే పరీక్షించి విజయనగరం తరలించాలని సూచించినట్లు 108 సిబ్బంది తెలిపారు. దీంతో అదే వాహనంలో ఆమెను విజయనగరం తీసుకువెళ్తుండగా గొట్లాం సమీప జాతీయ రహదారి 26 వద్దకు వచ్చేసరికి పురిటినొప్పులు తీవ్రం కావడంతో వాహనంలోనే ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత గౌరమ్మకు రక్తస్రావం ఎక్కువ కావడంతో విజయనగరంలోని ఘోషా ఆస్పత్రికి 108 సిబ్బంది తరలించారు. ఒక వైపు ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం, మరోవైపు గిరిజనుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి. రెండు నిండు ప్రాణాలను కాపాడిన 108 సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు.

ముఖ్యవ్యక్తుల భద్రతలో అనుక్షణం అప్రమత్తం

- పీఎస్‌ఓల ఫైరింగ్ ప్రాక్టీస్‌ను పరిశీలించిన ఎస్పీ



ఫైరింగ్ ప్రాక్టీస్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందల్

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా సారిపల్లిలోని పోలీసు శిక్షణ కేంద్రంలో గల ఫైరింగ్ రేంజ్‌లో వివిధ ఆయుధాలను వినియోగిస్తూ ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించే పీఎస్‌ఓల ఫైరింగ్ ప్రాక్టీస్‌ను ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య వ్యక్తుల భద్రతా విధుల నిర్వహణలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రత విధుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం తగదని, ముఖ్య వ్యక్తులను కలిసేందుకు వచ్చే వ్యక్తులను నిత్యం నిశితంగా గమనించాలని చెప్పారు. ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించే పీఎస్‌ఓలకు మూడురోజుల పాటు నిర్వహించిన రిఫ్రెషర్ కోర్సులో ముఖ్య వ్యక్తుల భద్రతకు వారు నిర్వహించే విధుల పట్ల, చేపట్టాల్సిన చర్యల పట్ల, శారీరకదారుఢ్యం మెరుగుపర్చుకోవడంలో శిక్షణ ఇచ్చామని ఎస్పీ తెలిపారు. అనంతరం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఫైరింగ్ నిర్వహించి, వారి నైపుణ్యాన్ని ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఎస్పీ సీఐలు ఏవీ. లీలారావు, ఆర్‌వీఆర్ కే.చౌదరి, ఆర్ఐ సెక్యూరిటీ టి.శ్రీనివాసరావు, ఆర్ఎస్సై టి.రామారావు, ఆర్మర్, ఫైరింగ్ సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

కలాసీల వేతన కష్టాలు

- ఫుడ్‌పార్క్ వద్ద ఆందోళన
- వేతన చెల్లింపుల్లో మోసమంటూ నిరసన
- గొడౌన్లకు వచ్చిన లారీల అడ్డగింత



ఫుడ్‌పార్క్‌లోకి లారీలు వెళ్లకుండా అడ్డుకుని నినాదాలు చేస్తున్న కలాసీలు

చీపురుపల్లి: ఉదయం విధులకు వచ్చినప్పటి నుంచి సాయంత్రం వరకు రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి పని చేస్తుంటే మాకు రావాల్సిన వేతనం మాత్రం అరకొరగానే వస్తోంది. మా కష్టాన్ని ఫుడ్‌పార్క్ యాజమాన్యం దోచుకుంటోంది.. నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ల పేరుతో కొల్లగొడుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న గొడౌన్లలో పని చేసే కలాసీలకు వచ్చే వేతనం కూడా మాకు రావడం లేదు. ఆ గొడౌన్లలో విధులు నిర్వహిస్తున్న కలాసీలకు మాకు తేడా ఏంటి? దాదాపు ఏడెనిమిది సంవత్సరాలుగా విధులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనాల మంజూరులో వివక్ష జరుగుతోందంటూ చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస సమీపంలో గల ఫుడ్ పార్క్ వద్ద కలాసీలు ఆందోళనకు దిగారు. ఫుడ్‌పార్క్ యాజమాన్యం న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. వేతనాల విషయంలో తమకు అన్యాయం జరుగుతోందంటూ మంగళవారం నిరసనకు దిగిన కలాసీలు ఫుడ్‌పార్క్‌లోకి వస్తున్న బియ్యం, మొక్కజొన్న లారీలను అడ్డుకున్నారు. ఫుడ్‌పార్క్ ప్రధాన గేటు వద్ద రాస్తారోకో నిర్వహించి ఎలాంటి వాహనాలు లోపలికి పంపించకుండా దాదాపు 150 మంది కలాసీలు నిరసన తెలిపారు. దీంతో మండలంలోని పత్తికాయవలస సమీపంలో ఉన్న ఫుడ్ పార్క్ నుంచి శ్రీకాకుళం జిల్లాలోని వెంకటాపురం వరకు భారీఎత్తున లారీలు నిలిచిపోయాయి.


ప్రణతోస్మి దివాకరం

పాల ధారల్లో భానుడు.. నిజరూపంలో ఆదిత్యుడు.. స్వర్ణాలంకరణలో సూర్యనారాయణ మూర్తి.. రథ సప్తమి నాడు దినకరుడు మూడు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చాడు. అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు జరిగిన క్షీరధారల మధనం తర్వాత అరుణ శిలపై స్వామి నిజ రూపం చూసి భక్తులు తన్మయత్వానికి గురయ్యారు. అనంతరం స్వర్ణాలంకరణ భూషితుడైన స్వామిని చూసి మురిసిపోయారు.

- ఘనంగా రథసప్తమి ఉత్సవం
- నిజరూప దర్శనానికి తరలివచ్చిన భక్తులు
- సాధారణ దర్శనానికి మూడున్నర గంటల సమయం



స్వామి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



ఆదిత్యుడిని క్షీరాభిషిక్తుడిని చేస్తున్న అర్చకులు

అరసవల్లి: మాఘ శుద్ధ సప్తమి పర్వదినం సూర్యజయంతి (రథసప్తమి) సందర్భంగా సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం రాత్రి 9 గంటల వరకు అరసవల్లిలో సూర్యనారాయణ మూర్తిని వేలాది మంది దర్శించుకున్నారు. అర్ధరాత్రి నుంచి క్షీరాభిషేక్తుడైన ఆదిత్యుడు...తర్వాత నిజరూపంలో భక్తకోటికి దర్శనమిచ్చి..అనంతరం సాయంత్రం నుంచి స్వర్ణాలంకరణలో వెలుగులు నింపారు. ఉదయం 7 గంటల వరకు పంచామృతాలతో పాటు క్షీరాభిషేకం జరిగిన అనంతరం సప్తమి ఘడియల్లో భక్తులకు ఒకేసారి క్షీరాదిత్యుడిగానూ నిజరూపంలోనూ దర్శనమివ్వడంతో భక్తజనం పులకించిపోయారు. సుమారు 60 వేల మందికి పైగా భక్తులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వర్ణాలంకరణలో ఆదిత్యుని మూలవిరాట్టు దర్శనమిచ్చారు. భక్తులు సంప్రదాయంగా సూర్యోదయ సమయంలోనే పిడకల పొయ్యిపై క్షీరాన్నం వండి స్వామికి ప్రసాదంగా నివేదించారు.

దర్శించుకున్న ప్రముఖులు

రథసప్తమి సందర్భంగా పలువురు ప్రముఖులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్వతీపురం మన్యం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి, ప్రముఖ గాయని మంగ్లీ తదితరులు స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో చిన్నారికి స్వర్ణపతకం



చిన్నారిని అభినందిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన ఆరిక యాగ్నిక్ అనే ఆరేళ్ల చిన్నారికి అంతర్జాతీయ కరాటే పోటీల్లో స్వర్ణపతకం దక్కింది. ఇటీవల విశాఖపట్నంలోని పోర్టు స్టేడియంలో అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక వంటి దేశాల క్రీడాకారులతో పోటీపడి మండలానికి చెందిన విద్యార్థి యాగ్నిక్ గోల్డ్‌మెడల్ సాధించడంతో ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలంటూ ప్రోత్సహించారు. కార్యక్రమంలో మాస్టర్ కోచ్ తోట సింహాచలం, కోచ్ ఆరిక సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో గిరిపుత్రుల సత్తా



మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన గిరిజన క్రీడాకారులతో కోచ్ రామచంద్రరావు

శృంగవరపుకోట: జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన గిరిజన క్రీడాకారులు సత్తా చాటి పతకాల పంట పండించారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ కేరళ రాష్ట్రంలోని త్రిశూర్ జిల్లా కున్నంకులం గ్రామంలోని ప్రభుత్వ బాలుర హై సెకండరీ స్కూల్‌లో నిర్వహించిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా గిరిజన క్రీడాకారులు 3 స్వర్ణం, 7 రజతం, 9కాంస్య పతకాలు సాధించారని కోచ్ చాపా రామచంద్రరావు చెప్పారు. ఉద్యోగాలు లేక ఉపాధి కోసం వేర్వేరు వృత్తులు చేసుకుంటూ ఆటపై మక్కువతో వచ్చి పతకాలు పండిస్తున్న గిరిపుత్రులను ప్రభుత్వాలు, లేదా ప్రైవేట్ క్రీడా సంస్థలు ఆర్థికంగా ఆదుకుని, అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. 2004లో గిరిజన క్రీడాకారులు 45 పతకాలు సాధించి ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ 2వ స్థానం సాధించారని, 2000లో మహిళలు ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్ సాధించారని వివరించారు. ఇటీవల జరిగిన పోటీల్లో పి.జయరాం 10కి.మీ పరుగులో రజతం, 1500మీ పరుగులో కాంస్యం, పి.కిశోర్ 5కి.మీ నడకలో స్వర్ణం, పి.కోటేశ్వరరావు పోల్‌వాల్ట్‌లో కాంస్యం, పి.దొరబాబు హైజంప్‌లో కాంస్యం, కె.రాంప్రసాద్ 5కి.మీ వాకింగ్‌లో వెండి. ఎం.శ్రీరాములు 5కి.మీ వాకింగ్‌లో కాంస్యం, కె.కన్నారావు లాంగ్ జంప్‌లో వెండి, హైజంప్‌లో కాంస్యం, 100మీ రన్‌లో కాంస్యం, ఎన్.చంద్రరావు 400మీ రిలేలో వెండి పతకం, 110మీ హర్డిల్స్‌లో కాంస్యం, కె.నరేష్ హర్డిల్స్‌లో కాంస్యం, కె.సోమునాథ్ 100మీలో కాంస్యం, పి.మంగళ్లు 200మీ లో వెండి పతకాలు సాధించారని కోచ్ వివరించారు.

డైమండ్ జూబ్లీ జంబోరీలో జిల్లా విద్యార్థుల ప్రతిభ



తిరుచరాపల్లిలో జంబోరి ముగింపు కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు, విద్యార్థులు

వేపాడ: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 సంవత్సరాల డైమండ్ జూబ్లీ జంబోరీలో పాల్గొన్న జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తాచాటారు. జిల్లానుంచి 50 మంది సభ్యులతో జిల్లా చీఫ్ కమిషనర్, జిల్లా జంబోరీ కంటిన్‌జెట్ లీడర్ బీపీఏ రాజు, వైస్ ప్రెసిడెంట్ నారాయణమూర్తి, గైడ్ క్యాప్టెన్ నయా మున్నీస్ తదితరులతో పాటు సోంపురం, లక్కిడాం, మొయిద, రెల్లివలస, కుమరాం, ఓపెన్ రోవర్ యూనిట్స్ నుంచి స్కౌట్స్ 39 మంది, 11 మంది గైడ్స్ పాల్గొన్నట్లు బీపీఏ రాజు తెలిపారు.

జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగిన కార్యక్రమంలో మన జిల్లా విద్యార్థులు ఫిజికల్ డిస్ప్లేలో ఎ గ్రేడ్, కాంప్‌ఫైర్, ఫుడ్ ప్లాజా, ఫోక్ డ్యాన్స్‌లలో బి గ్రేడ్, స్కిల్ ఓరామ పోటీలో సి గ్రేడ్ వచ్చినట్లు చెప్పారు. తమిళనాడులోని తిరుచరాపల్లిలో జరిగిన ముగింపు కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రితో పాటు దేశ విదేశాల ప్రతినిధులు పాల్గొన్న కార్యక్రమంలో తామంతా భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు.

రామనారాయణంలో రథసప్తమి పూజలు

విజయనగరం రూరల్: మండలంలోని రామనారాయణం ఆధ్యాత్మిక కేంద్రంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా ఆలయంలో సూర్యదేవుడికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా పాలు పొంగించి స్వామివారికి నివేదన చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారంతో విద్యార్థినులకు అస్వస్థత

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స



సర్వజన ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న జశ్విని

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని సుంకరి వీధిలో ఉన్న ప్రభుత్వ సాంఘిక వసతి గృహానికి చెందిన విద్యార్థినులు కలుషిత ఆహారం తినడంతో అస్వస్థతకు గురై ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వసతిగృహం విద్యార్థినులకు సోమవారం ఉదయం వాంతులు, విరోచనాలు అవడంతో సిబ్బంది 108 అంబులెన్సులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వారికి తరలించారు. ముందురోజు వసతిగృహంలో బిర్యానీ తిన్నామని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు తెలిపారు. అస్వస్థతకు గురైన వారిలో ఇద్దరు ఫిమేల్ వార్డులో చికిత్స పొందగా, ఒకరు ఐసీయులో చికిత్స పొందుతున్నారు. మంగళవారం మరో ఇద్దరు విద్యార్థినులు కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలోని ఓపీ విభాగానికి వచ్చి చికిత్స తీసుకుని వెళ్లిపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు తెలిపారు.

19 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

పార్వతీపురంటౌన్: ఈ నెల 19 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రాయింగ్, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్–ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్లలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు, హ్యాండ్లూమ్ వీవింగ్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 19 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీసీసీ ఫిబ్రవరి 2025 పరీక్షల టైమ్ టేబుల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓఈ.ఇన్ కార్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు.